
పొంచి ఉన్న ప్రమాదం

- రహదారుల్లో భయపెడుతున్న గోతులు
- సర్వీస్ రోడ్లపైనే నిర్మాణ సామగ్రి
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు


సర్వీస్ రోడ్డుపై వదిలేసిన క్రషర్ బొగ్గు


కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో రహదారిపై మెటల్ పోగు


సూర్యానగర్ రోడ్డుపై ఏర్పడిన గొయ్యి


పట్టాభిరెడ్డితోట రహదారిలో ప్రమాదకర మలుపు

మురళీనగర్: మురళీనగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మార్గాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇక్కడి రహదారులపై నిర్మాణ సామగ్రి పోగులుగా వేసి వదిలేయడం, రోడ్డు మధ్యలో గోతులు, ప్రమాదకర మలుపులు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారాయి. ఈ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముఖ్యంగా బిర్లా కూడలి జాతీయ రహదారికి అనుబంధంగా సర్వీస్ రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని రెయిలింగ్స్ నిర్మాణానికి రహదారిపై వేసిన బ్లాక్ మెటల్, క్రషర్ బుగ్గి కుప్పల వల్ల రాత్రి పూట ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటు వైపు రెండువైపులా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పీఆర్ గార్డెన్స్, సత్యానగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, సాయిరాంనగర్, మంచుకొండ గార్డెన్స్, సూర్యానగర్ తదితర కాలనీల వాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో వీధి లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి పూట చీకట్లో ద్విచక్ర వాహనంపై వెళ్లేవారికి ఈ మెటల్, క్రషర్ కుప్పలు కనిపించడం లేదు. శనివారం రాత్రి ఇద్దరు వాహన చోదకులు ఈ కుప్పల వద్ద వాహనాలు స్కిడ్ అయి త్రుటిలో భారీ ప్రమాదాల నుంచి తప్పించుకున్నారు. ఎదురుగా వచ్చిన వాహన చోదకులు ఒకరిని రక్షించడంతో అతడు గాయాలతో బయటపడ్డాడు. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మలుపుల్లో ముప్పు

కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా సర్వీస్ రోడ్డుకు అనుబంధంగా నిర్మించిన సూర్యానగర్–పట్టాభిరెడ్డితోట రహదారిలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. వాహనం దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహన చోదకుడు కనిపించడం లేదు. ఈ రహదారిని ఆనుకుని వాహనాలు పార్క్‌చేస్తున్నారు. మొదటి మలుపు వద్ద కనీసం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో వేసిన విద్యుత్ లైట్లు చెట్ల మధ్యలో ఉండటం వల్ల వాటి వెలుగులు రహదారిపై ప్రసరించడం లేదు. దీంతో రాత్రి పూట పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో సూర్యానగర్ వద్ద రహదారి మధ్యలో భాగం శిథిలమైంది. ఇది చూడటానికి చిన్న గొయ్యిలా కనిపించినా.. ఏమాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదం బారిన పడాల్సిందే. అధికారులు దృష్టి సారించి ప్రమాదకర మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిపోతున్న నీరు

బిర్లా కూడలి సమీపంలో వర్మ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిని అనుసంధానించే సర్వీస్ రోడ్డుపై నిత్యం నీరు నిలిచిపోతోంది. వర్షం నీటితోపాటు ఎగువ కాలువ నుంచి మురుగు నీరు రహదారిపైకి వచ్చి చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి పెట్రోల్ బంకు వరకు వానొస్తే ఇదే పరిస్థితి నెలకొంది. వర్షా కాలంలో ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అలరించిన స్టోరీ టెల్లింగ్


పిల్లలకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టెల్లింగ్ పిల్లలను అలరించింది. కథకురాలు సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో కథలు చెప్పి యువ మనసుల్లో ఊహ, సృజనాత్మకత వెలిగించారు. జూ డక్, టైన్ అండ్ ది ఫార్ అవే మౌంటైన్ కథలను చెప్పే విధానం ఆసక్తికరంగా సాగింది. పిల్లలు కథలు వినడంతోపాటు కథలకు సంబంధించిన ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. ముద్రించిన సాహిత్యాన్ని, వారి కలలను చిన్న చిన్న వర్క్ షీట్లపై పొందుపర్చారు. యాక్టివిటీలో భాగంగా పాటలు పాడటం, హ్యాండ్ ఆన్ యాక్టివిటీలు, బెలూన్ బ్లోయింగ్‌లో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పూజలు


అమ్మవారికి ప్రత్యేక హారతులిస్తున్న అర్చకుడు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు కల్పించారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితా పీఠంలో చండీ హోమం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో బహుళ అష్టమి సందర్భంగా ఆదివారం వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

గోపాలపట్నం: యల్లపువానిపాలెంలో మైనర్ బాలిక ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడక గదిలో హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. బాలిక యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లి వరలక్ష్మి ఎన్‌ఏడీలోని ఒక హోటల్లో పని చేస్తోంది. మధ్యాహ్నం వరకు అక్క, బావ ఇంట్లో ఉన్నారు. వారు బయటికి వెళ్లిన తర్వాత బాలిక ఉరి వేసుకుంది. వీరు మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి బెడ్ రూములో ఉరి వేసుకుని ఉండడం గమనించారు. దాంతో తలుపులు పగులగొట్టి బాలికను దించారు. అప్పటికే బాలిక మరణించినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. బాలికకు కడుపునొప్పి ఉందని, దీని వల్లే మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం


వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

మురళీనగర్: ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని విశ్వం ఆస్పత్రి చైర్మన్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ నితీష్ నేమాని అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్వం ఆస్పత్రి సహకారంతో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తాయని, వీటి నివారణకు సకాలంలో వైద్యుల సలహాలు పొందాలని సూచించారు. శిబిరంలో 236 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉదరకోశ వ్యాధి నిపుణుడు డాక్టర్ జమీర్ అహ్మద్, కీళ్ల వ్యాధి నిపుణుడు డాక్టర్ పి.వి.వి.సత్యనారాయణ, సాధారణ వ్యాధుల నిపుణులు డాక్టర్ టి.రవికుమార్, డాక్టర్ ఎం.కుసుమ 148 మందికి ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్షలు, 112 మందికి మధుమేహం, రక్తపోటు, ఇతర సాధారణ వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందిని సత్కరించారు. వైద్య శిబిరానికి వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, విశ్వం ఆస్పత్రి మేనేజర్ ఆల్ఫా బ్రైట్, వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వరాజు, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యదర్శి సిహెచ్.ప్రసాద్, విజయలక్ష్మి, వి.అప్పారావు, ఎస్.రామమోహన్, ఆర్.నాగేశ్వరరావు, టి.వి.రమణ, ఎస్.శ్రీనివాసరావు, కేఎస్ ఆర్‌కే ప్రసాద్ సహకరించారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు


సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెలుగుతున్న లైట్లు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పట్టపగలు విద్యుత్ లైట్లు వెలిగి ఉన్నాయి. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే ముందు సిబ్బంది కార్యాలయం వద్ద లైట్లు ఆపివేయాల్సి ఉంటుంది. ఎవరూ ఆపకుండా వెళ్లిపోవడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం రోజంతా ట్యూబ్‌లైట్లు వెలుగుతూనే ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ఈ విధంగా విద్యుత్ వృథా సరికాదని పలువురు స్థానికులు అంటున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలులో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 13న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం చేరుకున్న అనంతరం రైలును నిర్వహణ పనుల నిమిత్తం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించారు. రైలు నిర్వహణ పనులు చేపడుతున్న సమయంలో జనరల్ కోచ్‌లో సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని క్లీనింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా దళ సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు శనివారం రాత్రి మృతిచెందింది. ఈ మహిళకు సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, పసుపు, నలుపు రంగులు గల నైటీ ధరించి, చామనచాయలో ఉందని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. ఈమె గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు కోరారు.

టమాటా కోసం బారులు


రైతుబజారులో టమాటా స్టాల్ వద్ద క్యూలో వినియోగదారులు

సీతమ్మధార: టమాటా ధరలను అదుపులోకి తెచ్చేందుకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయిస్తున్నారు. సీతమ్మధార రైతుబజారులో ఆదివారం కిలో టమాటా రూ.32 చొప్పున విక్రయించారు. సండే కావడంతో వినియోగదారులు ఎక్కువ మంది క్యూలో ఉండి టమాటా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రైతుబజారు ఈవో కొండబాబు మాట్లాడుతూ ఒక్క రోజులో సుమారు 3,200 కిలోల టమాటాలు విక్రయించినట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కన్న తక్కువ ధరకు రైతుబజారులో అమ్మకాలు సాగిస్తున్నట్లు చెప్పారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

'చిన్నోడికి ప్రేమతో' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ చలం తదితరులు

దాబాగార్డెన్స్: తల్లిదండ్రులంతా చదవాల్సిన పుస్తకం 'చిన్నోడికి ప్రేమతో' అని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఎస్ చలం పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో ప్రతి బిడ్డకి ఇటువంటి అనుభవం అవసరమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ విజయలక్ష్మి దూరంగా ఉన్న తన బిడ్డకు తాను రాసిన ఈ ఉత్తరాలన్నీ బహుమతిగా ఇచ్చిన తర్వాత అనేక మంది చూసి ఇది పబ్లిష్ చేస్తే బాగుంటుందనే కోరిక మేరకు ప్రచురించామన్నారు. కార్యక్రమంలో విద్యా రంగంలో బాలల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, పి. మురళీకృష్ణ, సివిల్ సర్వెంట్ ఈదర రవికిరణ్, సుధ, శ్రీనాథ్, డాక్టర్ జోన్, బుద్ధ శ్రీనివాస్, నరవ ప్రకాశరావు, రవికిరణ్, చంద్రశేఖర్, సునీల్‌రెడ్డి, డాక్టర్ పద్మ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం ఎన్నిక

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 48వ వార్షిక సమావేశం ఆదివారం పాతనగరం వాసవీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దుర్గా సోమేశ్వరరావు అధ్యక్షుడిగా, కె. రామారావు కార్యదర్శిగా, పీవీఎస్ఎన్‌వీ సాంబమూర్తి కోశాధికారిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘ పూర్వ అధ్యక్షుడు గ్రంధి రామకృష్ణారావు వ్యవహరించారు.

విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

దాబాగార్డెన్స్: విశాఖ మ్యూజిక్ అకాడమీ 52వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. అకాడమీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న అకాడమీ సభ్యుల బృందం, సంగీత ప్రపంచానికి, ప్రత్యేకంగా విశాఖ మ్యూజిక్ అకాడమీకి అత్యధిక కాలం ఎనలేని సేవలందించి పదవీ విరమణ గావించిన అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రంగరాజన్, నాలుగు దశాబ్దాల పాటు సంగీత ప్రపంచంలో పేరు నిలబెట్టుకుంటూ అనన్య సామాన్యమైన సేవలందించిన కార్యదర్శి ఎమ్మెస్ శ్రీనివాస్‌ను సభ్యులు కొనియాడారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ న్యాయవాది, సంగీత ప్రియుడు కేవీ రామ్మూర్తిని అధ్యక్షుడిగా, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ వీరఘంట చంద్రశేఖర్‌ను కార్యదర్శిగా, ప్రముఖ న్యాయవాది బీఏ రాజారావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణను ఉపాధ్యక్షులుగా, కోశాధికారిగా సీహెచ్ దుర్గాప్రసాద్, సహ కార్యదర్శులుగా భుజంగరావు, ఎం. జ్వాలాప్రసాద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నూతన అధ్యక్షుడు కేవీ రామ్మూర్తి మాట్లాడుతూ నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా అకాడమీకి సేవలందించే ప్రయత్నం చేస్తుందన్నారు.

పచ్చని పరిసరాలతో ఆహ్లాదం


కేవీ-2 ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: పరిసరాలు పచ్చగా ఉంటే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని కేవీ-2 విద్యాలయ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ విజయనగర్‌కాలనీలోని కేంద్రీయ విద్యాలయం-2 ఆవరణలో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మాతృమూర్తికి గౌరవం ఇస్తూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామన్నారు. పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థి మొక్క నాటడంతో పాఠశాల పచ్చదనంతో కనిపిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీమద్రామాయణం' వ్యాస సంపుటి ఆవిష్కరణ


గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని(విష్ణువు) ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు' వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవికుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. ఉదాత్త కల్పనల వల్లే రామాయణానికి గొప్ప మహత్తు వచ్చిందన్నారు. విశ్వనాథ వారి రచన ఊహకందదని, పాత్ర ప్రవేశం చాలా గొప్పగా వర్ణిస్తారన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనుమడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు. వినూత్న రీతిలో వ్యాసకర్తలే సమీక్షించడం విశేషమని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ మాట్లాడుతూ తాత గారు రాసిన మూల గ్రంథాలన్నీ అచ్చువేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశ్వనాథ తండ్రి శోభనాద్రి ఆజ్ఞతో తాతగారు రామాయణం రాశారని తెలిపారు. చివరగా గరికిపాటి నరసింహారావు ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రయాగ సుబ్రహ్మణ్యం, తురగా కృష్ణకుమార్, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ప్రమీల, వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

- ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై దినచర్యపై ఆరా తీశారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న యువత

సీతంపేట: వాయుపుత్ర హెల్త్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రామాటాకీస్ వద్ద క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో 43 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథి కలివరపు దాలిరాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత రక్తం కొరతతో బ్లడ్ బ్యాంకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.శివశంకర్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా జిమ్ నిర్వహిస్తూ ఎందరినో ఆరోగ్య పథంలో నడిపిస్తున్న జిమ్ నిర్వాహకుడు కిలాని గణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో లైవ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ప్రమోద్, అరుణ, యడ్ల లక్ష్మణ్‌రెడ్డి, ఎస్.కిరణ్‌కుమార్, కాకి యేసుకుమార్, తమ్మారెడ్డి, టి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

దాబాగార్డెన్స్: పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధం సమసిపోవడానికి ఐక్య రాజ్యసమితి గట్టి ప్రయత్నం చేయాలని, వీటో దేశాలను నియంత్రించాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఇస్కఫ్, గ్లోబల్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనాకు సంఘీభావ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల అక్కడి ప్రజల జీవన విధానం ఛిద్రమైందన్నారు. ఆస్పత్రులను సైతం నేలమట్టం చేయడంతో యుద్ధ ఖైదీలు, పిల్లలు మృత్యువాత పడతున్నారన్నారు. ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాక ఉద్రిక్త పరిస్థితి నెలకొందని, గాజాను ఆక్రమించి యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. పాలస్తీనా గతంలో భారతదేశం మద్దతు కోరిందని, అయితే ఇటీవల ఇజ్రాయిల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించాక పరిస్థితులు మారాయన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, దేవా, సుకుమారన్, శ్యామ్‌సుందర్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షకు సంఘీభావం


దీక్షలో పాల్గొన్న సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షకు ఆదివారం డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు బానోజీ బిల్లా మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ దగ్గరికి వస్తే తరిమికొడతామని, ప్లాంట్‌కు ఎవరు వచ్చినా అడ్డుకుంటామని అన్నారు. ఉక్కు పరిశ్రమను లాభాల బాటలోకి తీసుకురావడానికి కార్మికులు కష్టపడి పని చేస్తుంటే ప్రభుత్వం, యాజమాన్యం కలిసి బొగ్గు కొరత సృష్టించారన్నారు. ఉత్పత్తికి ఆటంకం కలిగించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆపరేటివ్ డైరెక్టర్ మీసాల సురేష్, షాప్ కమిటీ మెంబర్ వినీష్, సూరప్పుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.